# 9 నెలల్లో 21 మందిని లాకప్‌లో హత్యచేసిన పోలీసుల అమానుషత్వాన్ని ఖండిద్దాం!

## అనుమానితుల్ని చిత్రహింసలుపెట్టి చంపుతున్న పోలీసులను శిక్షించమని ఉద్యమిద్దాం!!

A.P.C.L.C., O.P.D.R. పిలుపు

ప్రజలారా!

కొన్ని నెలల క్రింద ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అనే అంతర్జాతీయ పౌరహక్కుల సంస్థ భారతదేశంలో లాకప్ హత్యల గురించి ఒక నివేదిక ప్రకటించిన సంగతి పేపర్లలో చూసారు. ఆ నివేదిక గురించి భారత ప్రభుత్వం ఎంత అల్లరి చేసిందో కూడా చూసారు. అంతా అబద్ధం అనింది. అతి శయోక్తులనింది. మా పోలీస్ స్టేషన్లు నరక కూపాలా! హవ్వ! అని ఆశ్చర్యం ప్రకటించింది. లండన్ లో కూర్చొని మమ్మల్ని విమర్శించే హక్కు ఈ విదేశీయులకు ఎవరిచ్చారని ఆక్షేపించింది (అదే లండన్ లోను వాషింగ్‌టన్ లోను కూర్చున్న వాళ్ళను అప్పులడిగేటప్పుడు మట్టుకు వాళ్ళు మన ప్రభుత్వానికి విదేశీయులుగా కనిపించరు.

కానీ నిజానికి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అంత కష్టపడి సేకరించిన లాకప్ హత్యల జాబితా అసమగ్రమైనది. అసంపూర్ణమయినది. వాళ్లు కేవలం 450 సంఘటనల వివరాలు ఇచ్చారు. అవి దేశం మొత్తం మీద చాలా ఏళ్ళు జరిగిన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ దృష్టికి వచ్చిన లాకప్ హత్యలు. కానీ అసలు సంఖ్య దానికి ఎన్నో రెట్లు ఉంటుంది. ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే 1984 జనవరినుండి 1992 సెప్టెంబర్ లోపల 172 లాకప్ హత్యలు జరిగాయి. ఈ మాట 'ఎక్కడో లండన్ లో కూర్చున్న వాళ్ళు' అంటున్నది కాదు. ఇక్కడే ప్రతినిత్యం పోలీసు హింసకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మేము అంటున్నది. ఇది కూడా అబద్ధమనీ అతిశయోక్తి అనీ అల్లరి చేసే ధైర్యం ప్రభుత్వానికి ఉందా? ఉంటే ఒక్కొక్క కేసు చర్చిద్దాం, బహిరంగ న్యాయ విచారణ జరపమని ఆహ్వానిస్తున్నాం. ప్రభుత్వం సిద్ధమేనా?

## ఎవరిని చంపుతున్నారు?

లాకప్‌హత్యల ప్రస్తావన ఎప్పుడు వచ్చినా దేశంలో నేరాలు పెరిగిపోతున్నాయి. సంఘవ్యతిరేకశక్తులు పెచ్చురిల్లిపోతున్నారనీ వాళ్ళను అదుపు చేసే ప్రయత్నంలో పోలీసులు 'అప్పుడప్పుడు చిన్న తప్పులు చేస్తే చేసి ఉంచవచ్చుననీ' ప్రభుత్వం సంజాయిషీ ఇస్తుంది.

దేశంలో నేరాలు పెరిగిపోతున్న మాట నిజమే. రాజీవ్ గాంధీ బోఫోర్స్ కేసు, హర్షద్ మెహతా బ్యాంకు దోపిడీ కేసు, ఎన్టీ ఆర్ నాచారం కేసు, జనార్ధనరెడ్డి జనప్రియ కేసుల గురించి అందరం రోజూ వింటూనే ఉన్నాము. బహుశా ఈ నేరస్తులను అరికట్టడం కోసం పోలీసులు లాకప్పులలో కండలరగ శ్రమిస్తున్నారేమో?

ఉహుఁ, అటువంటిదేంలేదు.

ప్రత్యర్థుల మీద, ప్రజలమీద బాంబుదాడులు చేసి తమ అధికారాన్ని నిలబెట్టుకునే రాజకీయ నాయకుల గురించి, కాంట్రాక్టు టెండర్ వేయడానికి బాంబుల సమేతంగా పోయే నాయకుల గురించి వింటున్నాం. ఎరువులు బ్లాకు చేసే వ్యాపారస్థుల గురించి, సున్నంలో ఇసుక కలిపే సివిల్ కాంట్రాక్టర్ల గురించి, నెల నెలా వేల రూపాయలు జీతం తీసుకుంటూ కూడా లంచం ఇవ్వనిదే పనిచేయని అధికార్ల గురించి వింటున్నాం. చూస్తున్నాం. బహుశా ఈ నేరస్థులను అదుపు చేయడానికి పోలీసులు (పాపం) బలప్రయోగానికి పాల్పడుతున్నారేమో!

ఉహుఁ అదికూడా నిజంకాదు.

మరి వీళ్ళు లాకప్పులలో ఎవరిని చంపుతున్నారు?

ఈ సంవత్సరం ఇప్పటికి (అంటే తొలి 9 నెలలో) మన రాష్ట్ర పోలీసులు 21 మందిని లాకప్పులలో కొట్టి చంపారు. ఈ మృతులు ఎంత ఘోరమయిన సంఘ వ్యతిరేకులో కొంచెం తెలు సుకుందాం.

వీళ్ళలో ఐదుగురు రైతులు, ముగ్గురు కార్మికులు, ఆరుగురు కూలీలు లేక వృత్తిపనివాళ్ళు, ఇద్దరు చిన్న వ్యాపారులు, ఒకతను ఉద్యోగి. మిగిలిన నలుగురు వృత్తిరీత్యానే దొంగలు అయి ఉండవచ్చును. 21 మందిలో ఒకరిని మినహాయిస్తే మిగిలిన వాళ్ళంతా ఎస్.సి, ఎస్.టి, బి.సిలే.

ఈ దౌర్భాగ్యుల మీద ఉన్న నేరారోపణలు ఏమిటి? బ్యాంకులకు టోపీ వేసి కోట్లు గడించారా? ఎన్నికలు వాయిదా వేయించడానికి ప్రత్యర్థి అభ్యర్థిని హత్య చేయించారా? కల్లు, సారాయి కల్తీచేసి ప్రాణాలు తీసారా?

ఈ 21 మందిలో అంతటి మహానుభావులు ఒక్కరూ లేరు. నాగాయలంకలో చంపిన దగాని బాబురావుమీద, కొల్లాపూర్ లో చంపిన ఆవుల పెదనరసింహులు మీద, మందమర్రి పోలీసులు సిసిసి పోలీస్ స్టేషన్ లో కొట్టి చంపిన మల్యాల చంద్రారెడ్డి మీద,

పెందుర్తిలో చంపిన కాకర పైడయ్య మీద నేరారోపణ ఏదీ లేదు. వాళ్ళను కేవలం అనుమానం మీద కొట్టి చంపారు. మొదటి అతను దొంగేమోనన్న అనుమానం, మిగిలిన ముగ్గురికి రాడికల్స్‌తో సంబంధాలు ఉన్నాయన్న అనుమానం. భైంసాలో చంపిన రాజేశ్వర్‌ని చిన్నకొట్లాట కేసు. మాచర్లలో చంపిన ఏడుకొండలుది పేకాట కేసు. కోర్టులో విచారణ జరిగి ఉంటే కొద్దిపాటి జరిమానా తప్ప వేరే శిక్షపడేదికాదు ఇద్దరికీ. చిత్తూరు వన్ టవున్ లో చంపిన పెద్దప్పనాయుడు చేసిన నేరం ఏమిటంటే ఆపరేషన్ చేస్తానని డబ్బు తీసుకొన్న డాక్టరు ఎన్నాళ్ళయినా ఆపరేషన్ చేయకపోగా అదేమని అడిగితే ఇంకొంచెం డబ్బు తెమ్మన్నందుకు ఆ డాక్టర్ పైన కోపంతో దాడి చేయడం! అసలు నేరస్తుడు డాక్టరయినా ఆస్పత్రి సిబ్బంది చేతిలోనూ దెబ్బలుతిని చచ్చింది ముసలి రైతు పెద్దప్ప నాయుడు.

వెల్దుర్తిలో చంపిన మల్లాగౌడ్ పైన, అనంతపురం సబ్ జైలు నుండి చట్ట విరుద్ధంగా బయటకు తీసి కొట్టి చంపిన షికారి నాగరాజుపైన హత్య కేసులున్నాయని పోలీసులు అన్నారు. కాని నాగరాజును చంపిన కొన్ని దినాలకు ఆ హత్య కేసులో అసలు నేరస్థులను ఇప్పుడు పట్టుకొన్నామనీ గతంలో పొరబాటుగా కేసు పెట్టామనీ పోలీసులే ప్రకటించారు. ఇప్పుడు షికారి నాగరాజు ప్రాణం ఎవరు తిరిగి ఇవ్వాలి?

ఇల్లందులో చంపిన వాసం పుల్లయ్యపైన ఒక స్త్రీతో అసభ్యంగా ప్రవర్తించాడని అభియోగం. గురజాలలో చంపిన ఇద్దరిలో రెండవ వాడయిన బద్య నాయక్ పైన తన భార్యను చంపాడని అభియోగం. సైఫాబాద్ లో చంపిన నరసింగరావు పైన, నాయుడు పేటలో చంపిన సగుటూరి సుబ్బయ్య పైన తమ భార్యలను వేధించి ఆత్మహత్యకు కారకులయ్యారని అభియోగం. ఈ నేరాలన్నీ నిజంగా చేసినవే అయితే గర్హించవలసినవే. అసహ్యించుకోవలసినవే. కానీ రుజువు చేసేది ఎక్కడ? పోలీస్ లాకప్‌లోనా? శిక్ష వేసేది ఎవ్వరు? పోలీసులా?

మిగిలిన 8 మంది మీద ఉన్నది దొంగతనం అభియోగం. అవన్నీ నిజమేనని కొంతసేపు అనుకున్నా, వాళ్ళు దొంగిలించిన సొమ్ము కోట్లుకాదు, లక్షలు కాదు. వందలలో వేలల్లోని సొమ్మే. వీళ్ళను మన రాజకీయ నాయకులకంటే, నల్లబజారు వ్యాపారుల కంటే, లంచగొండి అధికారుల కంటే పెద్ద సంఘ వ్యతిరేక శక్తులుగా భావిద్దామా? లేకపోతే చిన్న నేరస్తులను కొట్టి చంపి పెద్ద నేరస్థులకు సెక్యూరిటీ బందోబస్తు కల్పించే మన రక్షణ వ్యవస్థను చూసి సిగ్గుపడదామా?

## లాకప్పులో కొట్టవచ్చునా? :

పెద్ద దొంగలు, చిన్న దొంగలు అన్న మీమాంస అటుంచి, అసలు లాకప్పులో కొట్టే అధికారం పోలీసులకు ఉందా?

లేదని చట్టం స్పష్టం చేస్తుంది. నేరం రుజువు అయ్యేంత వరకు ముద్దాయి నిర్దోషి కాబట్టి కొట్టడానికి వీలులేదు. నేరం రుజువు చేసే బాధ్యత పోలీసులది. ముద్దాయి చేత 'ఒప్పించడానికి' వీలులేదు. ఇది భారత రాజ్యాంగం ఆర్టికల్ 20 (3) లోని ప్రాథమిక హక్కు. 'ఒప్పించడం' కోసం అక్రమంగా లాకప్పులో నిర్బంధిస్తే భారత శిక్షాస్మృతి సెక్షన్ 348 ప్రకారం 3 ఏళ్ళు శిక్ష. 'ఒప్పించడం' కోసం కొట్టి గాయపరిస్తే సెక్షన్ 330 ప్రకారం 7 ఏళ్ల శిక్ష. తీవ్రంగా గాయపరిస్తే సెక్షన్ 331 ప్రకారం 10 ఏళ్ళు శిక్ష.

పోలీసుల దృష్టి చట్టానికీ రాజ్యాంగానికీ పూర్తిగా విరుద్ధం. 'కొట్టకపోతే నేరం ఒప్పుకుంటారా?' అంటారు. అంటే తాము అనుమానించగానే వాళ్ళు నేరస్తులు అయిపోయినట్టే. ఇంక పోలీసులు షికారి నాగరుజును హత్య కేసులో అనుమానించి అరెస్టు చేశారు ఒప్పించడానికికొట్టారు. చంపారు. ఇప్పుడు అసలు హంతకుడు దొరికాడనీ నాగరాజును పొరబాటుగా అనుమానించామనీ అంటున్నారు. అతని భార్య బిడ్డలకు అతని ప్రాణాన్ని ఎవరు తిరిగి ఇవ్వాలి? పెందుర్తిలో చంపిన కాకర పైడయ్య అసలు 'వాంటెడ్' కానేకాదని విశాఖపట్నం పోలీస్ కమీషనర్ స్వయంగా ఒప్పుకుంటున్నారు. ఈ సంగతి అతన్ని చచ్చేదాకా కొట్టి తెలుసుకున్నారు ఇప్పుడు అతనికి తిరిగి ప్రాణం ఎవరు పోయాలి?

చట్ట వ్యతిరేకమయిన అవగాహన పోలీసు యంత్రాంగానికి ఉండవచ్చునా? పాలకులకు అదే అనుకూలంగా ఉంది కాబట్టి ఉంచవచ్చుననే వాళ్ళు అనుకుంటున్నారు. పోలీసు యంత్రాంగం చట్టబద్ధంగా ప్రవర్తిస్తే ఈ దేశాన్ని ఏలడం సాధ్యం కాదని వాళ్ళు నిర్ణయించుకున్నారు. నేరం రుజువయ్యేదాకా నిర్దోషిననే నాగరిక విలువను రాజ్యాంగంలో రాసారు. నిర్దోషిత్వం రుజువయ్యేదాకా నేరస్తుడేననే అనాగరిక వైఖరి పోలీసులకు అలవాటు చేసారు. దేశాన్ని అనాగారికంగా ఏలుతున్నారు

## పోలీసులు పౌరులు కారా?

దేశపాలకుల ఆదేశానుసారం పోలీసులు చట్టానికీ రాజ్యాంగానికి విరుద్ధమయిన దృక్పథంతో పనిచేస్తున్నారు. 'విధినిర్వహణ' అనిపేరుపెట్టి నేరాలు చేస్తున్నారు. ఇవి 'విధినిర్వహణలో జరుగుతున్నాయి కాబట్టి నేరాలు కావని' ప్రభుత్వం అంటుంది. కొట్టి చంపేసి ఆత్మహత్య అనీ అనారోగ్యం అనీ రికార్డులో రాసి కేసులు

మూసేస్తున్నారు. ఈ సంవత్సరం జరిగిన 21 లాకప్ హత్యలలో 8 ఆత్మహత్యలన్నారు. 7 అనారోగ్యకారణంగా జరిగిన మరణాల న్నారు. ముగ్గురిని వేరేవాళ్ల కొట్టి చంపారన్నారు. ఒకతన్ని తాము వదిలేస్తే తనంటతాను తాగి చచ్చాడన్నారు. (మిగిలిన రెండు కేసుల వివరాలుతెలీవు). కొద్ది మినహాయింపులతో ఎక్కువ కేసులలో పంచనామా చేసే ఎం.ఆర్.ఓలు, శవపరీక్ష చేసే డాక్టర్లు పోలీసులకు వంత పాడుతున్నారు.

పోలీసులూ ఎం.ఆర్.వోలు డాక్టర్లుకలిసి నాటకాలు ఆడు తుంటే చట్టం చూస్తూ ఊరుకోవలసిందేనా? అందరు పౌరులలాగ పోలీసులమీద కూడ కేసుపెట్టి కోర్టులో విచారించవసరం లేదా?

ఉందని చట్టం అంటుంది. లాకప్పులలో కొట్టడం పోలీసుల విధి కాదు కాబట్టి కొట్టి చంపితే అది 'విధి నిర్వహణలో' జరిగిన పొరబాటుకాదు. అది హత్యే. సుప్రీంకోర్టు, లా కమీషన్ ఈ విష యంలో ఎంత దూరం పోయాయంటే లాకప్పులో జరిగేదానికి వేరే సాక్షులు ఉండరు కాబట్టి చట్టానికి సెక్షన్ 114 బి చేర్చి లాకప్పు మరణాలలో నిర్దోషిత్వం రుజువు చేసుకొనే బాధ్యత పోలీసుల మీదనే పెట్టాలని సూచించాయి! పోలీసు కస్టడీలో జరిగే ప్రతీ హత్యను జిల్లా జడ్జి (ఫిర్యాదు అవసరం లేకుండ) తానే హత్య కేసుగా నమోదుచేసుకొని విచారణ ప్రారంభించాలనీ చట్టాన్ని ఇందుకు అనుకూలంగా సవరించాలనీ దేశంలోని పౌరప్రజాస్వామ్య హక్కుల సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఆ మేరకు ఎం. సి.పి.ఐ. నాయకుడు శ్రీ ఓంకార్ ప్రవేశపెట్టిన బిల్లు ఒకటి రాష్ట్ర అసెంబ్లీ ముందు ఆమోదం కోసం వేచి ఉంది. మన ప్రతినిధులకు అసెంబ్లీలో పరస్పర దూషణకు తప్ప వేరే దేనికయినా టైం ఉంటేకదా! ఆ బిల్లు కనీసం మన రాష్ట్రంలో చట్టం కావడానికి!

ఈ సంవత్సరం ఇప్పటికి జరిగిన 21 లాకప్పు హత్యలలో ఒక్క నాగాయలంక కేసులో మాత్రమే సంబంధిత పోలీసులపై హత్యానేరం కేసుపెట్టారు. కాని నిందిత పోలీసులను అరెస్టుచేయ లేదు. భైంసా సంఘటనలో ఎస్.ఐ. పైన హత్య కేసు పెడుతున్నట్టు పై అధికారులు ప్రకటించారు. మిగిలిన ఏ ఒక్క కేసులోనూ చట్ట పరంగా చర్యతీసుకోలేదు. నాగాయిలంక కేసును అధికారయంత్రాం గం సీరియస్‌గా పట్టించుకోవటం మానివేసిందని ఈపాటికే తేలిపోయింది. విషయం వేడిగా వున్నప్పుడు ఆర్భాటంగా ప్రకట నలు ఇవ్వడం, అందరూ దానిని మరచిపోయిన తరువాత గుట్టు చప్పుడు కాకుండ వెనక్కి తీసికోవడం మన పాలకులకు అలవాటే. 1990లో నిజమాబాద్ డి.ఎస్.పిగా వున్న రాజారెడ్డిగారు చంద్రయ్య అనే డీలర్‌ను తన ఇంటికే తీసుకువచ్చి కొట్టి చంపినప్పుడు ఆ జిల్లాలో చాలా గొడవ జరిగింది. అప్పట్లో నిజామాబాద్ జిల్లా ఎస్.పి.గా వున్న మీనాగారు డి.ఎస్‌పిని అరెస్టుచేసి తీరుతానని శపథంచేసాడు నిజంగానే చేస్తాడని చాలామంది నమ్మారు. చేసిందే మిటంటే అతన్ని నిజామాబాద్ నుండి తప్పించి ప్రజల కళ్లకు కనుపించని తెల్లబట్టల పోస్టింగ్ ఇవ్వడం. ఇప్పుడతను ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ లో విజిలెన్స్ డిఎస్.పిగా వున్నాడు. అతని మీద కేసు పెట్టిందీ లేదు. అరెస్టు చేసిందిలేదు.

## నష్ట పరిహారం

ప్రభుత్వంలో భాగమయిన పోలీసులు తమ విధి నిర్వహణ పేరిట నేరాలు చేస్తే ఆ నేరాల వల్ల నష్టపోయిన వారికి నష్ట పరిహా రం యివ్వవలసిన బాధ్యత ప్రభుత్వం మీద లేదా? ఉందని మన రాష్ట్ర హైకోర్టు చల్లా రామకృష్ణారెడ్డి కేసులో చెప్పింది. దేశంలోని వివిధ హైకోర్టులు, సుప్రీం కోర్టు అదే తీర్పు గత కొద్దిసంవత్సరాలలో ఇచ్చి ఉన్నాయి. ప్రభుత్వం ఏం చేస్తుందంటే తీర్పు యిచ్చిన కేసులలో మట్టుకు నష్ట పరిహారం చెల్లిస్తున్నది. అంతేతప్ప ఒక నియమంగా నష్టపరిహారం ఇవ్వడం లేదు. కోర్టు తీర్పులకు శాసన రూపం ఇవ్వడం లేదు. లాకప్ హత్యలలో చనిపోయేది ఎక్కువగా పేదవాళ్ళు కాబట్టి ప్రతి ఒక్కరూ విడిగా కోర్టుకుపోయి నష్ట పరి హారం తెచ్చుకోలేరు. ఈ రకంగా ప్రజలను మోసం చేస్తున్నదీ ప్రభుత్వం.

పోలీసు అత్యాచారాలను అరికట్టడానికి ఒక మానవ హక్కుల కమిషన్ నెలకొల్పుతానని కేంద్ర ప్రభుత్వం ఈ మధ్య ప్రకటిం చింది. ఏర్పాటుకు పూనుకుందికూడా. కానీ చట్టాన్ని అందరికీ వర్తింపజేసినట్టు పోలీసులకు కూడా వర్తింపచేయనప్పుడు, ఏ చట్టంలో తీసుకురావలసిందిగా లా కమిషన్ స్వయంగా సూచించిన మార్పులను చేపట్టనప్పుడు, లాకప్ మృతుల కుటుంబాలకు యివ్వవలసిన నష్టపరిహారాన్ని గురించి కోర్టులు ఇచ్చిన తీర్పులకు శాసనరూపం ఇవ్వనప్పుడు, ఈ మానవ హక్కుల కమిషన్‌ను నెలకొల్పడం ఎవరిని సంతృప్తిపరచడానికి? అప్పులిచ్చే విదేశీ ప్రభుత్వాలనా?

లాకప్ హత్యల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక వైఖరి పోవాలంటే విస్తృతమయిన ఆందోళనే దానికి మార్గం. ఇప్పటికి అనేక సందర్భాలలో స్థానికంగా ప్రజలు లాకప్ హత్యలపట్ల నిరసనను ఆందోళన రూపంలో తెలియ చేస్తు న్నారు. ఈసంవత్సరం ధర్మవరం, భైంసా, నాగాయలంక, పెందుర్తి కేసులలో బలమయిన ఆందోళన ముందుకొచ్చింది. ఆ ఆందో ళనను సహించలేక ధర్మవరంలో ఆందోళనకారులమీద పోలీసులు కాల్పులుజరిపి లాకప్ మృతుని భార్యను, మరొక ఇద్దరిని కాల్చేసారు.

అయినప్పటికీ ఈ ఆందోళనల భయం లేకపోతే ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరికి పట్టపగ్గాలు లేకుండా పోతుంది. విడివిడిగా ఒక్కొక్క సంఘటనపట్ల నిరసన రూపంలో ముందుకొస్తున్న ఈ ఆందోళనలు లాకప్ హత్యలకు వ్యతిరేకంగా ఒక ప్రజా ఉద్యమంరూపం తీసుకున్న నాడే ఈ ఘోరాన్ని అరికట్టగలుగుతాం. ఆ ఉద్యమం కోసం కృషి చేయవలసిందిగా ప్రజాస్వామిక శక్తులకు పిలుపు నిస్తున్నాం.

★ లాకప్ మరణాలన్నిటినీ హత్యలుగా భావించి పోలీసులపైన కేసులు పెట్టాలి.

★ లా కమిషన్ సూచన ప్రకారం సాక్ష్యాల చట్టంలో సెక్షన్ 114.బి. చేర్చి, అది హత్య కాదని రుజువు చేసుకొనే బాధ్యత పోలీసులమీదే పెట్టాలి.

★ రాష్ట్ర హైకోర్టు చల్లా రామకృష్ణారెడ్డి కేసులో ఇచ్చిన తీర్పుకు చట్టరూపం ఇచ్చి లాకప్ మృతుల కుటుంబాలకు ఒక లక్షరూపాయలు తక్కువ కాకుండా నష్టపరిహారం ఇవ్వాలి.

★ పంచనామాను, శవ పరీక్షను బహిరంగంగా, ప్రజల సమక్షంలోనే జరిపేటట్టు చట్టాన్ని సవరించి అమలు చేయాలి.

## 1992 జనవరి – సెప్టెంబర్ కాలంలో రాష్ట్రంలో లాకప్ హత్యల జాబితా

1. ఫిబ్రవరి 24 : ఆదిలాబాద్ జిల్లా కోల్ కెమికల్ కాంప్లెక్స్ (సిసిసి) పోలీస్ స్టేషన్ లో మందమర్రి పోలీసులచేతిలో బొగ్గుగని కార్మికుడు ముత్యాల చంద్రారెడ్డి మృతి. (2) ఫిబ్రవరి 29 : మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో ముసలి రైతు ఆవుల పెద నరసింహులు మరణం. (3) మార్చి 11 : మెదక్ జిల్లా వెల్దుర్తి పోలీస్ స్టేషన్ లలో హనుమాద్రి మల్లాగౌడ్ (రైతు) మృతి. (4) ఏప్రిల్ 3 : ఖమ్మం ఒన్ టౌన్ లో బస్టాండ్ లో పని చేసుకొనే శనిగారపు మల్లయ్య మృతి. (5) ఏప్రిల్ 15 : ఆదిలాబాద్ జిల్లా భైంసా పోలీసులు కొట్టిన దెబ్బల ఫలితంగా చిన్న బట్టల దుకాణం యజమాని హనుమంతోళ్ల రాజేశ్వర్ రోడ్డు మీదపడి మరణించాడు. (6) ఏప్రిల్ 20 : గుంటూరు జిల్లా మాచర్ల పోలీసుల చేతి దెబ్బలకు రజకుడు మంగపట్నం ఏడుకొండలు మృతి. (7) ఏప్రిల్ 20 : అనంతపురం సబ్ జైలునుండి పోలీసులు బయటికి తీసి కొట్టిన ఫలితంగా భూమిలేని కూలి షికారి నాగరాజు మృతి. (8) ఏప్రిల్ 27 : అనంతపురం ఒన్ టౌన్ పోలీసుల చేతిలో సైకిల్ షాపు యజమాని బలిజ హనుమంతు మరణం. (9) మే 15 : నెల్లూరు జిల్లా నాయుడుపేట పోలీసుల చేతిలో పాలేరు పగుటూరి సుబ్బయ్య మరణం.

(10) మే 20 : హైదరాబాద్ నగరంలోని చిలకలగూడ పోలీసులు వేరే కొందరు వ్యక్తులు కొట్టగా రైల్వే కార్మికుడు సి. సత్యనారాయణ మరణం. (11) జూన్ 14 : గుంటూరు జిల్లా గురజాల పోలీస్ స్టేషన్ లో ముఠా కూలి దూదేకుల పెద్దయ్య మృతి. (12) జూలై 20 : కృష్ణా జిల్లా నాగాయలంక పోలీస్ స్టేషన్ లో భూమిలేని వ్యవసాయకూలీ దగాని బాబూరావు మరణం. (13) జూలై 29 : కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ లాకప్ లో 'దొంగ' తెల్ల నర్సయ్య మరణం. (14) ఆగస్ట్ 8 : హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ఉద్యోగి వి నరసింగరావు మరణం. (15) ఆగస్ట్ 22 : ఖమ్మం జిల్లా ఇల్లందు పోలీస్ స్టేషన్ లో వాసం పుల్లయ్య అనే రైతు మరణం. (16) ఆగస్ట్ 27 : చిత్తూరు ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పెద్దప్పనాయుడు అనే ముసలి రైతు మరణం. (17) ఆగస్ట్ 31 : అనంతపురం జిల్లా ధర్మవరం పోలీస్ స్టేషన్ లో 4 రోజుల నిర్బంధం అనంతరం మొండి సోమయ్య అనే వ్యక్తి మృతి. (18) సెప్టెంబర్ 7 : విశాఖపట్నం జిల్లా పెందుర్తి పోలీస్ స్టేషన్ లో పెట్టిన చిత్రహింసల ఫలితంగా నాలుగు రోజుల అనంతరం కాకర పైడయ్య అనే కార్మికుని మృతి. (19) సెప్టెంబర్ 27 : గుంటూరు జిల్లా గురజాల పోలీస్ స్టేషన్ లో పెట్టిన చిత్రహింసల ఫలితంగా లంబాడా రైతు బద్య నాయక్ ఆస్పత్రిలో మృతి.

1 అక్టోబరు, 1992.


ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (OPDR)

మీ స్పందనను ఆహ్వానిస్తున్నాం :

★ డా॥ కె. బాలగోపాల్, ప్రధాన కార్యదర్శి, APCLC
శాతవాహన మెస్ వెనుక వీధి,
నారాయణగూడ, హైదరాబాద్.

★ సి. భాస్కరరావు,
ప్రధాన కార్యదర్శి, OPDR
నగరం పోస్టు, గుంటూరు జిల్లా.



చదవండి
స్వేచ్ఛ, జనపథం
చందాదారులు కండి